సాక్షి
కుమురం భీం

సోమవారం ; 29 ; మే ; 2023



కాడి దూరం.. అద్దె భారం
కాడెద్దులు క్రమంగా రైతులకు దూరమవుతున్నాయి. ఏటా సాగు వ్యయం పెరగడంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸



యాదవులు అన్నిరంగాల్లో ఎదగాలి
యాదవులు అన్నిరంగాల్లో ఎదగాలని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంచిర్యాలలో యాదవ శంఖారావ సమావేశం నిర్వహించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
41.9/29.6

వాతావరణం
భానుడి ప్రతాపం కొనసాగుతుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి. సాయంత్రం వర్షం పడొచ్చు.

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
ఆసిఫాబాద్: కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో 2024 పద్మ అవార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. కళారంగం, అక్షరాస్యత, విద్య, క్రీడ, వైద్య రంగాలు, సామాజిక బాధ్యత, సైన్స్ ఇంజనీరింగ్, ప్రజల వ్యవహారాలు, పౌర సేవలు, కార్మిక పరిశ్రమల రంగాల్లో విశేష సేవలందించిన జిల్లా ప్రజలు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా 2023 సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

31న సహకార బ్యాంకు ప్రారంభం
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జుబ్లీ మార్కెట్ సమీపంలో కొత్తగా నిర్మించిన భవనంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకును ఈ నెల 31న డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి ప్రారంభిస్తారని సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ చౌక్ సమీపంలో నిర్వహిస్తున్న బ్రాంచీని కొత్త భవనంలోకి మార్చుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని వెల్లడించారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ ఫిరోజ్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు ప్రతిరోజూ పట్టణంలో స్పెషల్ డ్రైవ్ డిస్‌కనెక్షన్ బ్యాచ్‌లు తిరుగుతున్నాయని, బిల్లులు చెల్లించని వారి కనెక్షన్లు తొలగిస్తామన్నారు. బిల్లులు కట్టకుండా అక్రమంగా విద్యుత్ వాడుకునే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బిల్లులు చెల్లించి, సంస్థకు సహకరించాలని సూచించారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి
రెబ్బెన(ఆసిఫాబాద్): డ్రైవర్లు ఏకాగ్రత, అప్రమత్తతతో వాహనాలే నడపాలని తనిఖీ బృందం సభ్యులు, మందమర్రి ఏరియా రక్షణాధికారి రవీందర్ అన్నారు. ఈ నెల 15 నుంచి 31 వరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న లైట్ మోటర్ వాహనాలు, మల్టీ యుటిలిటీ వాహనాల కదలికపై భద్రత అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం కైరిగూడలో డ్రైవర్లు, ఈపీ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. తనిఖీ బృందం సభ్యులు మాట్లాడుతూ సింగరేణిలో యంత్రాల వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డ్రైవర్లు, ఈపీ ఆపరేటర్ల పాత్ర ఎంతో కీలకంగా మారుతోందన్నారు. నిర్లక్ష్యంతో జరిగే చిన్నపాటి తప్పిదానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం లైట్ మోటర్ వాహనాలు, ఎంయూవీ వాహనాల కోసం క్వారీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూజీఎం కేహెచ్ ఎన్ గుప్తా, మందమర్రి ఏరియా ఇంజనీర్ నాగరాజు, కేకే ఓసీపీ పీవో సూర్యనారాయణ, కైరిగూడ పీవో ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజనీరు రాజాజీ, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి వెంకటేం, జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, సంక్షేమాధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.



వార్ధా నదిలో చేపలు పడుతున్న మత్స్యకారులు

నదులే జీవనాధారం!

జిల్లాలోని సరిహద్దు వెంబడి వార్ధా, పెన్‌గంగ, ప్రాణహిత వంటి జీవ నదులు ప్రవహిస్తున్నాయి. ఈ నిత్య జలధారాలను నమ్ముకుని వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రధానంగా బెస్త కుటుంబాలు చేపల వేటే ఆధారంగా బతుకుతున్నాయి. వలకు చేపలు చిక్కితే పండుగ.. లేకుండా పస్తులే అన్న తీరుగా వారి జీవనం సాగుతోంది.

- చేపల వేటతో ఓడబెస్త కుటుంబాలకు ఉపాధి
- చేపలు దొరకని రోజుల్లో పస్తులే..
- సంక్షేమ పథకాలు అందక తీవ్ర అవస్థలు
- జిల్లా సరిహద్దు వెంబడి వార్ధా, పెన్‌గంగ, ప్రాణహిత నదులు



నదిలో పట్టిన చేపల విక్రయాలు

కౌటాల(సిర్పూర్): జిల్లాలోని కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, సిర్పూర్(టి) మండలాల్లోని ఓడబెస్త(బోయ) కులానికి చెందిన వారు ఏళ్లుగా మత్స్యకారులుగా జీవితాన్ని గడుపుతున్నారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టిలోని మత్స్యకారులు ప్రాణహిత నది, గుండాయిపేట, తాటిపల్లిలో వార్ధా నది, అలాగే బెజ్జూర్ మండలంలోని తలాయి, పెంచికల్‌పేట్‌లోని మురళీగూడ, చింతలమానెపల్లిలోని గూడెం గ్రామంలోని మత్స్యకారులు ప్రాణహిత నదిలో చేపల వేట సాగిస్తారు. ఆయా గ్రామాల్లోని 150కి పైగా బెస్త కుటుంబాలు సమీపంలోని నదుల్లో చేపలు పట్టి విక్రయిస్తుంటాయి. ప్రతీ కుటుంబం నుంచి దాదాపు ముగ్గురు ఉదయం పూటే నాటు పడవలతో నదిలోకి వెళ్తారు. కొంత

జిల్లాలో బెస్త కుటుంబాల వివరాలు		
మండలం	గ్రామం	కుటుంబాలు
కౌటాల	తుమ్మిడిహెట్టి, గుండాయిపేట, తాటిపల్లి	90
బెజ్జూర్	తలాయి	20
పెంచికల్‌పేట్	మురళీగూడ	15
చింతలమానెపల్లి	గూడెం	25
సిర్పూర్(టి)	బెస్తకాలనీ	20

మంది రాత్రిపూట కూడా చేపలు పడుతుంటారు.

చిక్కితే పండుగే..

ప్రతీరోజూ ఒక్కొక్కరికి నాలుగైదు కిలోల వరకు చేపలు పడుతాయి. బొమ్మె, పెద్ద పొరుసు లాంటివి దొరికితే కాస్త ధర పలుకుతుంది. చిన్న చేపలు కిలోకు రూ.100 మాత్రమే చెల్లిస్తారు. నది వద్దకు వచ్చే వ్యాపారులు కిలోకు రూ.140 నుంచి రూ.160 వరకు చెల్లించి, మండల కేంద్రాల్లో రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తుటారు. ఇలా మత్స్యకారుల వలకు చేపలు చిక్కితే రోజుకు రూ.500 వరకు దొరికే అవకాశం ఉంది. మగవారంతా రాత్రి, పగలు చేపల వేటకు వెళ్తే.. మహిళలు గ్రామాల్లో కూలీ పనులకు వెళ్తారు. చేపలు వలకు చిక్కకపోయినా.. కూలీ పనులు లేకపోయినా కుటుంబం మొత్తం పస్తులు ఉండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు..

చేపల వేటకు వాడే వలలకు మార్కెట్‌లో రూ.1500 వరకు ధర ఉంటుంది. విసిరే వలలు సొంతంగా తయారు చేసుకున్నా రూ.2వేల ఖర్చు వస్తుంది. సంవత్సరానికి రెండు చొప్పున ఈ వలలు కొనుగోలు చేస్తారు. ఇది మత్స్యకారులకు భారంగా మారింది.

ఉదయమే వెళ్తాం



ఉదయం వెళ్తే సాయంత్రం వరకు ఒకటో.. రెండో కిలోల చేపలు పడుతాయి. అవి అమ్ముకుంటేనే కుటుంబం గడవాలి. వర్షాకాలంలో నదిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో చేపలు దొరకవు. ప్రస్తుతం ప్రవాహం తక్కువగా ఉండటంతో చేపలు వలలకు చిక్కుతున్నాయి.

– జి.పింటు, గుండాయిపేట్

వాహనం లేదు



ఇంట్లో నేను, అన్న ఇద్దరం చేపల పట్టేందుకు వెళ్తాం. నేను రాత్రి పోతే.. తమ్ముడు పొద్దుగాల పోతడు. కొన్నిసార్లు ఇద్దరం కలిసి వేటకు వెళ్తాం. చేపలు గ్రామాల్లోకి అమ్ముకునేందుకు ప్రత్యేక వాహనం లేదు. మార్కెటింగ్‌కు ఇబ్బంది పడుతున్నాం.

– కె.ఉత్తేజ్, తుమ్మిడిహెట్టి

ప్రభుత్వం ఆదుకోవాలి



గ్రామంలో 35 కుటుంబాలు చేపలు పడుతూనే బతుకుతున్నాయి. వ్యవసాయానికి మాకెవరికీ భూమి లేదు. నదిలోకి నాటు పడవల్లోనే వెళ్లి చేపలు పడుతాం. ప్రమాదం జరిగితే ప్రాణాలే పోతాయి. ప్రభుత్వం బోట్లు, సబ్సిడీ వాహనాలు, రుణాలు అందించి ఆదుకోవాలి.

– జి.లస్మయ్య, గుండాయిపేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా వారికి అందడం లేదు. జిల్లాలోని బెస్త కుటుంబాలకు సబ్సిడీ వాహనాలు కూడా అందలేదు. కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దాహం తీర్చని భగీరథ

పల్లె జనం గొంతెండుతోంది. గుక్కెడు నీటి కోసం వారి అవస్థలు వర్ణనాతీతం. బిందెలతో కిలోమీటర్ల మేర నడిచి వెళితే గాని దాహార్తి తీరని దుస్థితి. ఇలా 'గిరి' పుత్రులకు బావులు, వాగులే దిక్కవుతున్నాయి. మరోవైపు ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామంటున్న పాలకుల మాటలు ఆచరణలో కనిపించడం లేదు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఉమ్మడి జిల్లాలోని పలు తండాలు, గూడేలకు ఇప్పటికీ మిషన్ భగీరథ నీరందడం లేదు. 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి వచ్చిన తాగునీటి ఇక్కట్లపై ఫోకస్. -8లో▸

అంబేద్కర్ ఆశయాలు సాధించాలి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- గంగాపూర్‌లో విగ్రహావిష్కరణ

రెబ్బెన(ఆసిఫాబాద్): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. రెబ్బెన మండలం గంగాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకప్పుడు అణచివేయబడిన బడుగు, బలహీన వర్గాల్లో ప్రస్తుతం కొంత అభివృద్ధి కనిపిస్తోందంటే అది అంబేద్కర్ రాజ్యాంగం పుణ్యమేనన్నారు. ఆయన కృషితో విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో నేడు రిజర్వేషన్లు అనుభవిస్తున్నామని స్పష్టం చేశారు. సమాజంలో అసమానతలను సమూలంగా రూపుమాపేందుకు జీవితాంతం పోరాడారని కొనియాడారు. అంతటి మహానుభావుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, సర్పంచ్ వినోద, ఎంపీటీసీ హరిత, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుండాయిపేటలో బీఎస్పీ సభ

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం గుండాయిపేట గ్రామంలో సోమవారం బీఎస్పీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సిర్పూర్(టి) నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. గుండాయిపేటలో నూతన బుద్ధ విహార్ ఆవిష్కరణ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో గ్రామంలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. అలాగే సాయంత్ర 4 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో రెండో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. బూత్‌స్థాయి అధికారులను పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచి దరఖాస్తులు తీసుకునే విధంగా తహసీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. మరణించిన, గ్రామం వదిలివెళ్లిన వారు, రెండుసార్లు ఉన్న పేర్లను గుర్తించాలన్నారు. తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'వేదిక'.. అందరిదిక!

- రైతువేదికల్లో 42 శాఖలకు అనుమతి
- అన్ని శాఖల సమావేశాలకు పర్మిషన్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 305 రైతువేదికలు



నిర్మల్‌చైన్‌గేట్: సాగులో సమస్యలు వస్తే అన్నదాతలు వ్యవసాయాధికారులను కలవాలంటే ఒకప్పుడు మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయాభావం, ఆర్థికభారం రైతులపై అదనంగా పడేది. వ్యవసాయాధికారులు సాగులో అధునాతన పద్ధతులు, యాంత్రీకరణ, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలంటే వేదిక దొరకడమే కష్టంగా ఉండేది. వీటన్నింటినీ గమనించిన రాష్ట్ర ప్రభుత్వం రైతువేదికలను నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. వేదిక కేంద్రంగా ప్రస్తుతం వారంలో రెండురోజులు వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ పంటల సాగుపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆయిల్‌పామ్ సాగుపై దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ రైతువేదికల్లో ఇకనుంచి అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈమేరకు వ్యవసాయ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పరిధిలోని 42శాఖల వారు క్లస్టర్ స్థాయి సమావేశాలకు ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. దీంతో రైతువేదికలు ఇక అన్ని ప్రభుత్వ శాఖల కార్యక్రమాలకు వేదికలుగా మారనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 305 రైతువేదికలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ప్రభుత్వం 305 రైతువేదికలు నిర్మించింది. ఒక్కో వేదికకు రూ.22 లక్షలు వెచ్చించింది. నిర్వహణకు నెలనెలా రూ.9 వేలు అందిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలు, 468 గ్రామపంచాయతీలుండగా 101 రైతువేదికలు నిర్మించారు. నిర్మల్ జిల్లాలో 18 మండలాలు, 396 గ్రామపంచాయతీలుండగా 79, మంచిర్యాల జిల్లాలో 16 మండలాలు, 310 గ్రామపంచాయతీలుండగా 55, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాలు, 335 గ్రామపంచాయతీలుండగా 70 వేదికలు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు.

ప్రస్తుతం వ్యవసాయశాఖ సమావేశాలే..

రైతువేదికల్లో ప్రస్తుతం వ్యవసాయశాఖకు సంబంధించిన సమావేశాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఏటా భూసార పరీక్షల కోసం సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులకు సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే భూసార పరీక్ష సామగ్రి వచ్చినా వాటికి అవసరమయ్యే రసాయనాలను మాత్రం సరఫరా చేయలేదు. దీంతో భూసార పరీక్ష కిట్లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ నుంచి వచ్చిన తాజా ఉత్తర్వులతో రైతువేదికలు అన్ని ప్రభుత్వ శాఖల సమావేశాలు, కార్యక్రమాలకు వేదిక కానున్నాయి.

ఏఈవోలు ఉండాల్సిందే..

క్లస్టర్‌కు ఒకరు చొప్పున వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో)ను ప్రభుత్వం నియమించింది. రైతువేదికల నిర్వహణ వ్యవహారమంతా ఏఈవోలు చూసుకుంటున్నారు. వారు నిత్యం రైతువేదికలకు రావాల్సిందే. అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో సంతకం చేయాలని ప్రభుత్వం కొత్త నిబంధన తెచ్చింది. ఒకవేళ ఎక్కడికైనా వెళ్తే.. రిజిస్టర్‌లో వివరాలు రాసి పెట్టాలని పేర్కొంది. మండలాల్లో పర్యటనకు వచ్చే జిల్లా అధికారులు, ప్రత్యేకాధికారులు రైతువేదికలను సందర్శించాలని సూచించింది.

జిల్లా	మండలాలు	జీపీలు	క్లస్టర్లు	రైతువేదికలు
నిర్మల్	18	396	79	79
ఆదిలాబాద్	18	468	101	101
మంచిర్యాల	16	310	55	55
కుమురంభీం	15	335	70	70

ఆదేశాలు అందాయి



రైతువేదికల్లో వ్యవసాయ అనుబంధ శాఖలు కూడా సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. వీటిని ఆయా శాఖల అధికారులకు చేరవేశాం. ఏఈవోలు కూడా రైతు వేదికలకు వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాలి.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

బడి బస్సు భద్రమేనా..?

- జిల్లాలో 97 ప్రైవేట్ స్కూల్ బస్సులు
- నాలుగింటికి మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్
- నిర్లక్ష్యం చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలు

ఆసిఫాబాద్: మరో 15 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ సమయంలోనే ప్రైవేటు పాఠశాలల బస్సులకు అవసరమైన రెన్యూవల్స్, మరమ్మతులు, ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. బడులు తెరిచే నాటికే బస్సులు ఫిట్‌గా ఉంచే బాధ్యత సంబంధిత యాజమాన్యాలదే. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 97 ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు ఉండగా, ఇప్పటివరకు కేవలం నాలుగు బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించారు. రవాణా శాఖ అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే ఉండడంతో పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలపై అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. ఏటా మే 15న ఫిట్‌నెస్ గడువు ముగుస్తుంది. 16 నుంచి అధికారులు తనిఖీలు చేసి వచ్చే ఏడాదికి సర్టిఫికెట్ ఇస్తారు.

నిబంధనలు ఇలా..

ఎంవీఐ రూల్ 185(జీ) ప్రకారం పాఠశాలల యాజమాన్యాలు సుమారు 32 నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. సంబంధిత వెబ్‌సైట్‌లో స్కూలు వివరాలు నమోదు చేయాలి. స్కూల్ అడ్రస్, సెల్ నంబర్, బస్సు నంబర్, డ్రైవింగ్ లైసెన్సు, బ్యాడ్జి, ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లతో పాటు వాహన వివరాలు పొందుపర్చాలి. బస్సులో ఉండే అటెండర్ పేరు, వయస్సు, ప్రయాణించే విద్యార్థుల సంఖ్యను నమోదు చేయాలి. బస్సు ఎక్కే మెట్లు ఫుట్‌బోర్డు నుంచి 325 మిల్లీమీటర్లకు మించి ఉండొద్దు. ఫుట్‌బోర్డు వద్ద పిల్లలు ఎక్కి, దిగేందుకు వీలుగా రెయిలింగ్, పవర్ స్టీరింగ్ ఉండాలి. డ్యాష్ పానల్ బోర్డుపై ఎడమ, కుడి ఇండికేటర్ ఉండాలి. ఎయిర్‌ప్రెజర్ గేజ్, ఫెయిల్స్ సేఫ్టీ ఇండికేటర్, బ్రేకుల్లో లోపాలు తెలిపే ఇండికేటర్, ఎయిర్ ప్రెజర్ గేజ్, ఫ్యూయల్ మీటర్, స్పీడో మీటర్, డ్రైవర్ సీటు పక్కన ఎయిర్ హ్యాండ్ బ్రేక్, హ్యాండ్ లివర్ గైడ్ స్ప్రింగ్, గేర్ లివర్‌లో అంతర్గత స్ప్రింగ్, పిల్లల కదలికలు తెలుసుకునేందుకు రెండు వైపులా అద్దాలు, అగ్నిమాపక సిలిండర్, తలుపులకు లాకింగ్ సిస్టం, సీట్ల కింద విద్యార్థుల లగేజీ బాక్సులు కచ్చితంగా ఉండాలి. అత్యవసర ద్వారం వద్ద అద్దం పగలగొట్టేందుకు సుత్తె అందుబాటులో ఉండాలి. సైడ్ విండోలకు మధ్యలో 31 అంగుళాలకు మించకుండా మూడు లోహపు కడ్డీలు ఏర్పాటు చేయాలి. సీటింగ్ కెపాసిటికి మించి విద్యార్థులను ఎక్కించుకోవద్దు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండాలి. పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరి.

డ్రైవర్ అర్హతలు

18 సీట్ల లోపు సామర్థ్యం ఉన్న స్కూల్ వ్యాన్, బస్సు డ్రైవర్లకు ఎల్‌ఎంవీ ట్రాన్స్‌పోర్టు లైసెన్సు, బ్యాడ్జి ఉండాలి. 20 సీట్లు దాటిన బస్సులు నడపడానికి హెచ్‌టీవీ బ్యాడ్జి లైసెన్సు ఉండాలి. వాహనాల సీట్లు, సామర్థ్యం బట్టి డ్రైవర్‌ను ఎంపిక చేయాలి. లైసెన్సు వివరాలు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. బస్సు, డ్రైవర్, అటెండర్ పూర్తి ఆరోగ్యంగా ఉండాలి. వారి వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల లోపు ఉండాలి. ప్రతీ మూడు నెలలకు స్కూలు యాజమాన్యం వారికి సొంత ఖర్చులతో బీపీ, మధుమేహం, గుండె, కంటి పరీక్షలు నిర్వహించాలి.



తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి

విద్యార్థుల తల్లిదండ్రులు బస్సుల కండిషన్ గురించి తరచూ తెలుసుకుంటూ ఉండాలి. బస్సుల విషయంలో యాజ మాన్యాలు నిబంధనలు పాటిస్తున్నాయో లేదో ఆరా తీయాలి. డ్రైవర్, అటెండర్ ప్రవర్తన గమనిస్తూ ఉండాలి. బస్సుల డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నారా..? పిల్లలు ఎక్కి దిగేటప్పుడు బాధ్యతగా ఉంటున్నారా.. అనేది తెలుసుకోవాలి. డ్రైవర్, అటెండర్ తీరును ఎప్పటికప్పుడు పిల్లలను అడిగి తెలుసుకోవాలి. సమస్యలుంటే రవాణా శాఖ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

'ఆశ వర్కర్లకు పరీక్ష వద్దు'

కాగజ్‌నగర్‌రూరల్: ఏళ్లుగా సేవలందిస్తున్న ఆశ వర్కర్లకు మళ్లీ పరీక్ష నిర్వహించొద్దని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని విద్యాధరి హైస్కూల్‌లో ఆదివారం ఆశవర్కర్ల యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్లకు పరీక్షను రద్దు చేసి, ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 5లోగా వేతనాలు చెల్లించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, ప్రధాన కార్యదర్శి పద్మ, శ్రీలత, రాజేశ్వరి, అర్చన, ఓమల, ద్రౌపతి, లక్ష్మి, అరుణ, సరోజ, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

క్లుప్తంగా

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న గురువారం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలతో జూన్ 1న ఉదయం 9 గంటలకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రంగంపేటలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులు, మహిళలకు మాస్టర్స్(వెట్రన్స్) 35 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్, 55 ప్లస్, 60 ప్లస్, 65 ప్లస్, 70 ప్లస్, 75 ప్లస్ వయస్సు గల మాస్టర్స్‌కు పోటీలు ఉంటాయని, ఇందులో పాల్గొనే క్రీడాకారులు మే 31 సాయంత్రం 6 గంటలలోగా 99599 77929, 8978753944 నంబర్లకు ఫోన్‌చేసి ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని కొండపల్లిలో విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లబోయిన శ్రీదేవికి చెందిన ఆవు ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోకి మేతకు వెళ్లింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. గమనించిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బాధిత రైతుకు విద్యుత్‌శాఖ తరపున నష్టపరిహారం అందజేస్తామని అధికారులు తెలిపారు.

గేదెను తప్పించబోయి కారు బోల్తా



బోల్తాపడిన కారు

రెబ్బెన(ఆసిఫాబాద్): అడ్డువచ్చిన గేదెను తప్పించబోయిన కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన రెబ్బెన మండలంలోని దుర్గాపూర్ బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సింగల్‌గూడకు చెందిన అజ్మీర రవి, అజ్మీర రాజు, మండల కేంద్రానికి చెందిన సురేందర్ పనినిమిత్తం కారులో గోలేటికి వెళ్లి తిరిగి వస్తుండగా దుర్గాపూర్ బస్టాప్ సమీపంలో గేదె కారుకు అడ్డుగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో కారు చెట్టును ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలుకావడంతో మంచిర్యాలకు తరలించారు. ఈ విషయమై రెబ్బెన ఎస్సై భూమేష్‌ను వివరణ కోరగా కారు బోల్తాపడిన విషయం వాస్తమేనని, ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గడ్డివాము దగ్ధం

తానూరు(ముధోల్): మండలంలోని బెంబరలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలి మంటలు చెలరేగడంతో తీగల కింద ఉన్న ఎల్లురి పిరాజీ అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

తరాలు మారినా పల్లె ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చెబుతున్న పాలకులు గ్రామాలకు గుక్కెడు నీళ్లు ఇవ్వలేకపోతున్నారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశ పెట్టింది. పథకం ఉద్దేశం మంచిదే అయినప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేలకు మాత్రం తాగు నీరు అందడం లేదు. దీంతో గిరిజనులు మంచినీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కుమురంభీం జిల్లా జైనూర్ మండలం గౌరి కొలాంగూడ (దేవుగూడ)కు చెందిన ఆత్రం జైతుబాయి, ఆత్రం సోంబాయి, సిడాం మత్తుబాయి శనివారం తాగునీటి కోసం బావి వద్దకు వెళ్లారు. నీళ్లు తోడుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. స్థానికులు వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ, గిరిజన గ్రామాల ప్రజలు తాగునీటికి తిప్పలు పడుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రామీణులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెలుగులోకి తెచ్చేందుకు 'సాక్షి' ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించింది.



కొలాంగూడ (దేవుగూడ)లో బావిలో పడిపోయిన మహిళలను నిచ్చెనసాయంతో రక్షిస్తున్న స్థానికులు



కిలోమీటరు దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్న గోండుగూడ ఆదివాసీలు



బిందెలతో గుట్ట ఎక్కుతున్న మామిడిగూడ గ్రామస్తులు

దాహం తీర్చని భగీరథ

- ఆదివాసీ గూడేలకు అందని 'మిషన్'
- వాగులు, బావినీరే గిరిపుత్రులకు దిక్కు
- గుక్కెడు నీటికి కిలోమీటర్ల దూరం నడక..
- బావుల వద్ద ప్రమాదకర పరిస్థితి..
- సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టని పాలకులు
- 'సాక్షి' విజిట్‌తో వెలుగులోకి

కలెక్టర్ సారూ జెర పట్టించుకోండి..

నార్నూర్: మండలంలోని సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు గూడేలు ఉన్నాయి. తండా, గొండుగూడ, కొలాంగూడల్లో మొత్తం 700 మంది జనాభా నివాసం ఉంటున్నారు. మూడు గూడేలకు నీటి సౌకర్యం లేకపోవడంతో కొలాంగూడలో ఉన్న ఒకే చేతి పంపుపై ఆధారపడుతున్నారు. గోండుగూడ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బిందెడు నీటికోసం దాదాపు రెండు కిలోమీటరు కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఈ నెల 5న కలెక్టర్ రాహుల్‌రాజ్ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులతో కలిసి కాలినడకన వెళ్లి బావిని పరిశీలించారు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గిరిజనులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు వారానికి మూడు రోజులు మాత్రమే వస్తున్నాయని, మిగితా రోజులు కష్టాలు తప్పడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాయకపుగూడలో...



చెలిమల నుంచి నీరు తెచ్చుకుంటున్న నాయకపుగూడ ఆదివాసీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని గోవెన పంచాయతీ పరిధిలోని నాయకపుగూడలో మిషన్ భగీరథ పథకం పనిచేయడంలేదు. దీంతో గ్రామస్తులు కిలోమీటర్ దూరంలో ఉన్న వాగులోని చెలిమల నుంచి నీటిని తెచ్చుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు.

ప్రమాదమని తెలిసినా...



నీటి కోసం బావి వద్ద గుమిగూడిన మహిళలు

నార్నూర్(జైనూర్): కుమురంభీం జిల్లా జైనూర్ మండలంలోని గౌరి కొలాంగూడ (దేవుగూడ)లో దాదాపు 200కు పైగా కొలాం గిరిజనులు నివాసం ఉంటున్నారు. గ్రామానికి కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గత్యంతరం లేక గ్రామ సమీపంలో ఉన్న ప్రమాదకరమైన బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. కర్ర మొద్దు సాయంతో బావిలోకి దిగి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పడంలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాగాపూర్‌లో నీటిగోస



ఎడ్లబండిలో నీటిని తీసుకువస్తున్న గ్రామస్తుడు

బోథ్: మండలంలోని నాగాపూర్‌లో 671 మంది జనాభా ఉన్నారు. గతంలో గ్రామంలో 10 బోర్లు వేశారు. వీటిలో రెండు చేతిపంపులు కూడా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో అందులోంచి చుక్కనీరు కూడా రావడం లేదు. దీంతో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జైనూర్ పల్లె గ్రామంలోని ఓ బోరు నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుని పైపుల ద్వారా గ్రామానికి దగ్గర్లో ఉన్న ఓ బావిలో నీటిని నింపుతున్నారు. ఈ నీటినే గ్రామస్తులు తాగడానికి, నిత్యావసరాలకు ఉపయోగిస్తున్నారు. ఈ పైపులైన్లను కూడా గ్రామస్తులు సొంత ఖర్చుతో వేసుకోవడం గమనార్హం. ఇలా బావి నింపడానికి పనులు మానుకుని రోజుకు కుటుంబానికి ఒకరు చొప్పున వంతులు వేసుకుని ఇంటి పట్టునే ఉంటున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పథకం నీటిట్యాంకు ఉన్నా ఏడాది కాలంగా లీకేజీల సమస్యతో నీటి సరఫరా కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

దాహం తీరదు



నల్లా వద్ద క్యాన్లతో యువకులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులు, 23,543 మంది జనాభా, 7,510 గృహాలు ఉన్నాయి. ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా పది ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. మున్సిపాలిటీ పరిధిలోని మహంకాళివాడ, నాయి బ్రాహ్మణవీధి, శివాలయం వీధి, పద్మశాలి కాలనీ, ఇందిరానగర్, ఎస్‌సీవాడ, రజకవాడ, కొత్తగూడెం కాలనీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణ సమీపంలోని మదనం పోచమ్మ వద్ద గల నల్లా నీటిని తీసుకెళ్తున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు



బోరుబావి వద్ద మామిడిగూడ గ్రామస్తులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మండలంలోని అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు. భూగర్భ జలాలు అడుగంటి మంచి నీటి పథకాలు పని చేయకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని మామిడిగూడకు నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామానికి దూరంలో ఉన్న వ్యవసాయ బోరుబావి నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు దృష్టిసారించి తమ గ్రామానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏటా ఇబ్బందులే..

కౌటాల: కన్నెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పాత కన్నెపల్లిలో 30 కుటుంబాలు, 130 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో చేతిపంపు, బావినీరు తాగుతున్నారు. లేదంటే రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న బోదంపల్లికి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని, ఏటా వేసవిలో ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు.



బావి వద్ద బారులు తీరిన మహిళలు

గిరితండాల్లో...



నల్లా వద్ద తాగు నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

తానూరు(ముధోల్): మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఝరి(బి)తండాలో 250 కుటుంబాలు 700ల జనాభా ఉన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా రూ.13 లక్షలు వెచ్చించి పైప్‌లైన్ వేశారు. కానీ పైపులైన్ లీకేజీల కారణంగా నీరు సరఫరా కావడం లేదు. త్రీఫేజ్ విద్యుత్ ఉన్న సమయంలో నల్లా వద్ద నీటిని పట్టుకుంటున్నామని, విద్యుత్ లేని సమయంలో వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జెండాగూడలో...

తాంసి(బోథ్): భీంపూర్ మండలం కమట్‌వాడ పంచాయతీ పరిధిలోని జెండాగూడలో ప్రజలు తాగునీటికి అనేక ఇక్కట్లు పడుతున్నారు. వారానికి ఒకసారి మాత్రమే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. దీంతో గ్రామంలో ఉన్న 20 కుటుంబాలు గ్రామ సమీపంలో ఉన్న చేతిపంపు వద్ద వంతుల వారీగా వేచి ఉంటూ నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతిరోజు మిషన్ భగీరథ నీటిని విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చేతిపంపు వద్ద బిందెలతో మహిళలు

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా అత్యంత ప్రతిభ కనబరిచిన 35 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు 10 రోజుల శిక్షణ అనంతరం జూన్ రెండో వారం నుంచి హైదరాబాద్‌లో జరుగబోయే జిల్లాస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కోచ్ పోరండ్ల ప్రదీప్ తెలిపారు. ఎంపికైన వారిలో క్రీడాకారులు జగదీశ్‌రెడ్డి, సాత్విక్, ఎండి హుజైర్, మనోజ్, అనిరుద్, సంతోశ్, అబ్దుల్, రెహమాన్, వర్షిత్, లక్ష్మణ్, సింహాద్రి, గణేశ్, సాయి కుమార్, డి.రామ్, జై గణేశ్, నితిన్, రూబు, షేక్ షాదాబ్, రెహాన్, అబ్దుల్ కైఫ్, సుభాష్, అర్జున్, తరుణ్, అజయ్ రాథోడ్, యువరాజ్, విష్ణుతేజ, అవినాశ్, ఆంజనేయులు, కార్తికేయ ఉన్నారు.

దేశీదారు పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టుబడినట్లు ఎస్సై డి.సాగర్ తెలిపారు. రెబ్బెన మండలంలోని గోలేటికి చెందిన జాడి కేశవ్ ఆదివారం 76 దేశీదారు (90ఎంఎల్) బాటిళ్లను మహారాష్ట్ర నుంచి తీసుకువస్తూ వాంకిడి మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పట్టుబడినట్లు తెలిపారు. దేశీదారు విలువ సుమారు రూ.4వేలు ఉంటుందని, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'పోరుగర్జన' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి ఉద్యోగుల సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెంలో తలపెట్టిన ప్రజా పోరుగర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన డివిజన్‌స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేజ్‌బోర్డు ఒప్పందంలో బొగ్గుగని కార్మికులకు అలవెన్స్‌లతో కలుపుకుని 25శాతం వేజెస్ బెనిఫిట్ ఉంటుందన్నారు. దేశంలో ఇంతవరకు ఏ ప్రభుత్వ రంగ సంస్థలో ఇలాంటి చరిత్రాత్మక ఒప్పందం జరుగులేదన్నారు. సమావేశంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సత్యనారాయణ, అక్బర్‌అలీ, మల్లేశ్, చిప్ప నర్సయ్య, సుదర్శన్, లింగయ్య, వెంకటస్వామి, నాగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పాల్గొ

కంటైనర్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఇచ్చోడ(బోథ్): మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన కంటైనర్‌లో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్‌లో ఇచ్చోడ పెట్రోల్ బంక్ వద్ద, గుడిహత్నూర్ మండలంలో దాబా హోటల్ వద్ద, నేరడిగొండ మండల పరిధిలో దాబా హోటల్ వద్ద ఏడుగురు వ్యక్తులు ఏకకాలంలో కంటైనర్‌లో ఉన్న వస్తువులను చోరీ చేశారన్నారు. ఈ కేసులో ఇచ్చోడ సర్కిల్ పరిధిలో ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నాలుగు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఆదివారం మొండిగుట్ట వద్ద ఉన్న దాబా హోటల్లో పనిచేస్తున్న ఖాలీద్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో హర్యానకు చెందిన మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఖానాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని, సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. నియోజకవర్గం ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటి వరకు పాలించిన నాయకులు కేవలం వారి కుటుంబాన్ని అభివృద్ధి చేసుకున్నారే తప్ప నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏం చేయలేదన్నారు. ప్రజలకు హక్కులు కల్పించడంలో విఫలమైన కలెక్టర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులని ప్రతివాదులుగా చేర్చి ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు.

నేడు 'నిధి ఆప్ కే నికత్'

కౌటాల(సిర్పూర్): భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం 'నిధి ఆప్ కే నికత్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కరీంనగర్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 సెల్వట్‌కార్ తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ మీ ముగింట పేరిట అవగాహన శిబిరం, ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో గల అష్టలక్ష్మి జిన్నింగ్ మిల్లు, నిర్మల్ జిల్లా కొండాపూర్‌లోని సెయింట్ థామస్ హైస్కూల్, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్, కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భవిష్యనిధి సభ్యులు, కార్మిక సంఘాలు, సంస్థల యాజమానులు తమ ఫిర్యాదులను పరిష్కరించుకోవాలని సూచించారు.



సోలార్ పంపు ద్వారా సాసర్‌వెల్‌లోకి వస్తున్న నీరు



పాత మామిడిపల్లి నీటి కుంట

మండు వేసవిలో నిండుకుండలా..

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు అధికారులు ఏర్పాటు చేసిన నీటి కుంటలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. తాళ్లపేట్ రేంజ్‌లోని పాత మామిడిపల్లి ఊట్ల సమీపంలో సహజసిద్ధంగా గుట్టపై నుంచి వస్తున్న నీటికి ఆనకట్ట వేశారు. అక్కడి నుంచి కాలువల ద్వారా మరో రెండు కుంటలను నింపారు. దీంతో మండు వేసవిలో కూడా కుంటల్లో నీరు నిల్వ ఉంటోంది. జన్నారం రేంజ్, ఇందన్‌పల్లి రేంజ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సోలార్ పంపుల ద్వారా సాసర్ వెల్, నీటికుంటలకు నీరు వదలడం ద్వారా వన్య ప్రాణులకు ఇబ్బంది లేకుండా మారింది. ఆయా రేంజ్‌ల పరిధిలో ఊట ద్వారా నీరు వచ్చేలా ఏర్పాటు చేసిన ర్యాంప్‌వెల్‌లు మండే ఎండల్లో కూడా మూగజీవాల దాహార్తి తీరుస్తున్నాయి.



ర్యాంప్‌వెల్‌లో నీరు